విశాలాంధ్ర కృష్ణా జిల్లా

రోడ్డుపై కృష్ణాజలాలు

విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వ మండలం, కూచిపూడిలోని బార్లపూడి రోడ్డులో గల రామాలయం వద్ద ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న నీరు బాటసారులను, భక్తులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. తోట్లవల్లూరు మండలం, ఐలూరు కృష్ణానదిలోని నీరు ఈ మండలంలోని అనేక మారుమూల గ్రామాలకు సరఫరా అవుతోంది. ఈ దశలో రామాలయం ప్రాంతంలో పైపు లీకై నీరు వృథాగా పోతోంది. ఈ విషయాన్ని గ్రామపంచాయతీ అధికారులు సంబంధిత శాఖకు తెలియపరిచినట్లు కార్యదర్శి ఇ. భవాని తెలిపారు. దీని మూలంగా తాగునీరు నేలపాలవటమే కాకుండా రహదారి ఛిద్రమవటంతోపాటు వాహనదారులు ఇక్కట్ల పాలవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీస్ నియామకాలపై అవగాహన

విశాలాంధ్ర-తిరువూరు: స్థానిక సత్య బీఈడీ కళాశాలలో పోలీస్ నియామక ప్రక్రియపై యాదవ సామాజికవర్గ యువతకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. తిరువూరు నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘం అధ్వర్యంలో జరిగిన సదస్సులో సంఘ అధ్యక్షులు వాకధాని లక్ష్మీనారాయణ రిక్రూట్మెంట్ విధానం, నియమ నిబంధనలు, పోటీ పరీక్షలో అనుసరించాల్సిన మెలకువలను వివరించారు. అభ్యర్థులు ప్రణాళికబద్ధంగా చదివినట్లయితే తప్పక విజయం సాధిస్తారని తెలిపారు. తేళ్ళ గోపీనాథ్ పోలీస్ సెలక్షన్స్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించారు. యాదవ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు అనంత గోపాలరావు, ట్రెజరర్ కందుల విజయకుమార్, ఉపాధ్యక్షులు జొన్నలగడ్డ రాంబాబు, ముత్తయ్య, సహాయ కార్యదర్శి నరసింగ్ నాగరాజు తేళ్ళ గోపీనాథ్‌ని సత్కరించారు.

ఘనంగా వాజ్‌పేయి జయంతి

విశాలాంధ్ర-తిరువూరు: స్థానిక నియోజక వర్గ బీజేపీ కార్యాలయంలో ఆదివారం భారతరత్న అటల్ బిహారీ వాజ్ పేయి జయంతి జరిగింది. పార్టీ నాయకులు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బీజేపీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దేవిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, దారా మాధవరావు, షేక్ నాగేశ్వరరావు, రామిశెట్టి రవిసూర్య, పానుగంటి రాధాకృష్ణ, దేవరశెట్టి రవీంద్రబాబు, అన్నపురెడ్డి వెంకటేశ్వం రావు, చెన్నోజు శ్రీనివాసా చారి, కంభం తిరుపతయ్య, అల్లడి కృష్ణయ్య, కేసానపల్లి రాఘవ, జీడిమల్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గంపలగూడెం: బీజేపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి గంపలగూడెంలో బీజేపీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ మండల ఉపాధ్యక్షులు నేరెళ్ల. యుగంధర్, పట్టణ శాఖ అధ్యక్షులు కోదుమూరు. సూర్యప్రకాష్ (బుజ్జి), జిల్లా బీ.సీ మోర్చా కార్యదర్శి కే .నాగ గోపాలకృష్ణ, బి. సిమోర్చా అధ్యక్షులు శివశంకర్, మండల కార్యదర్శి చిట్యాల. హనుమంతరావు, నాయకులు పాపోలు. నరసింహారావు, తాటికొండ. శ్యామ్, డి.వి. రామారావు, అన్నవరపు. క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ: భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 98వ జయంతిని స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామినేని వెంకటకృష్ణ, గుత్తికొండ శ్రీరాజబాబు పాల్గొన్నారు. పట్టణాధ్యక్షుడు అంగడాల సతీష్, నాయకులు సూరే గాంధీ, శనంకాయల లీలా కుమార్, మురళీ, ప్రసాద్, కుటుంబరావు,గుప్తా, వెకంటేష్, బలరామ్, పాల్గొన్నారు.

అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

విశాలాంధ్ర-కోడూరు: మండలంలోని ఉల్లిపాలెం గ్రామ సమీపం గల తెలుగు తల్లి విగ్రహం వద్ద శనివారం రాత్రి కోడూరు ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని పట్టుకున్నారు. కోడూరు నుంచి మచిలీపట్నం వైపునకు వారధి మీదగా తరలిస్తుండగా పట్టుకుని, వాహనాన్ని అదుపు లోకి తీసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేయనున్నట్టు వివరించారు.

గన్నవరం అభివృద్ధిపై కాకాని ముద్ర

విశాలాంధ్ర-గన్నవరం: గన్నవరం ప్రాంతాభివృద్ధికి ఎనలేని కృషిచేసిన వారిలో కాకాని వెంకటరత్నం ముఖ్యులని, ఈ ప్రాంతంలో తనదైన ముద్ర వేశారని ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి టి.ఎస్.ఆర్.కె ప్రసాద్ తెలిపారు. గన్నవరం మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఉక్కు కాకాని వెంకటరత్నం 50వ వర్ధంతి వేడుకలు గన్నవరం సహకార సంఘ భవనం వద్ద ఆదివారం పెద్దలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు జాస్తి శ్రీధర్, గూడపాటి త్రివేది, కాసరనేని గోపాలరావు, జాస్తి వెంకయ్య, కాసరనేని రంగబాబు, జాస్తి వెంకట కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. తొలుత కాకాని వెంకటరత్నం విగ్రహంతో పాటు మాజీ ఎమ్మెల్యే వెలివెల సీతారామయ్య, పిన్నమనేని కోటేశ్వరరావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముగిసిన తిరుపతమ్మ మాలధారణ

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ అమ్మ వారి దీక్ష మాల ధరణ 19 నుంచి ప్రారంభమైంది. శనివారంతో మాలాధారణ ముగిసింది. ఆలయ ప్రధాన పూజారి గురుస్వామి. మాత్రైబోయిన వెంకటరమణ దీక్ష స్వాములకు మాలలు వేశారు. 1040 మంది మాల స్వీకరించారని గురుస్వామి తెలిపారు. ఆలయ ఈఓ లీలా కుమార్, చైర్మన్ ఇంజం కేశవరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సత్యనారాయణ, చలపతిరావుల మృతికి సంతాపం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్: చలనచిత్ర రంగంలో అపార అనుభవం కలిగిన సుప్రసిద్ధ చలనచిత్ర నటుడు కైకాల సత్యనారాయణ, చలపతిరావు మృతికి తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు సంతాపాన్ని ప్రకటించారు. ఆరు దశాబ్దాలకు పైగా 780 పౌరాణిక, సాంఘిక, చారిత్రక, జానపద చిత్రాలలో నాయకునిగా, ప్రతి నాయకునిగా, హాస్యనటునిగా, మరిన్ని విభిన్న, వైవిధ్యభరితమైన పాత్రలను నవరసాలను పోషించి తనకు తానే సాటి అనిపించుకుని ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేసుకున్న సత్యనారాయణ మృతి దిగ్భ్రాంతి కలిగించిందని అన్నారు. రెండు రోజులలోనే నటుడు చలపతిరావు హఠాన్మరణం ప్రేక్షకులు జీర్ణించుకోలేనిదని అన్నారు. డాక్టర్ వేముల హజరత్తయ్య గుప్తా, చీదెళ్ళ నాగేశ్వరరావు, శింగంశెట్టి చంద్రశేఖర్, కొప్పరపు వెంకటబలరామకృష్ణమూర్తి, డేవిడ్ రాజు, మారేపల్లి జోషి, సయ్యద్ అలీ, గోళ్ళ నారాయణరావు, కారుమంచి రాజు, జ్ఞాన కిషోర్, దండు చంద్రశేఖర్, ప్రసూన రామన్, డాక్టర్ భాగ్యశ్రీ తదితరులు సత్యనారాయణ, చలపతిరావుల మృతికి సంతాపాన్ని తెలిపారు.

గంజాయి దహనం



విశాలాంధ్ర-కంచికచర్ల: పోలీసు కమిషనరేట్ పరిధిలోని 24 పోలీసు స్టేషన్లలో భారీ మొత్తంలో పట్టుబడిన గంజాయిని పోలీసులు దహనం చేశారు. విజయవాడ పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు 1992 నుంచి ఇప్పటివరకు నిల్వ ఉంచిన సుమారు 14,300 కేజీల, సుమారు రూ.5 కోట్ల విలువ గల గంజాయిని దహనం చేసినట్టు వారు పేర్కొన్నారు.

వాడవాడలా ఘనంగా క్రిస్మస్

గుడివాడలో...

కూచిపూడిలో...

కృష్ణలంకలో...

చల్లపల్లిలో...

విజయవాడలో...

యలకల చలపతిరావు అధ్వర్యంలో...

తిరువూరులో...

పెదపారుపూడిలో...

విశాలాంధ్ర-గుడివాడ: లోకరక్షకుడు నేడు పుట్టెను.. అల్లెలూయ.. ఆమెన్ అంటూ పట్టణంలోని పలు చర్చిలలో బాలయేసు జన్మదిన వేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహించారు. క్రీస్తు ఆగమనాన్ని స్వాగతిస్తూ పలు దేవాలయాల్లో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి గీతాలాపనలు చేశారు. శనివారం రాత్రి నుండే ఆర్‌సియం చర్చిలలో క్రైస్తవ విశ్వాసులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని మౌంట్ కార్మెల్ ఆర్‌సిఎం దేవాలయం, కోతిబొమ్మ సెంటర్‌లోని అవిలాపురి చిన్న తేరాజమ్మ ఆర్.సి.ఎం.-2 దేవాలయంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో క్రైస్తవ విశ్వాసులతో మతాలకు అతీతంగా వేలాది మంది ప్రజానీకం పాల్గొన్నారు. రాత్రి 11 గంటల సమయంలో స్థానిక ఏలూరురోడ్డులోని ఆర్‌సిఎం చర్చిలలో ఫాదర్లు గుజ్జుల మైఖేల్, మరియన్న, రవికాంత్‌లు, గుడ్‌మన్‌పేట చర్చిలో విచారగురువు ఎం.లూయిస్, రాయప్ప, కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో సందేశాన్ని అందించి క్రీస్తు జనన పశువుల కొట్టం(స్క్రిబ్) ప్రారంభించి ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమములో కౌన్సిల్ అధ్యక్షులు ఏలేటి విలియం జోషి, సభ్యులు, బేజం సువర్ణరాజు, మెండా కిరణ్, పొంగులేటి జయరాజు, సెబాస్టియన్, క్రీస్తురాజు, భాస్కర్, ఇంటి స్వామిదాస్, వి.జీవరత్నం, విచారణపరిధిలోని సిస్టర్స్, ఉపదేశకులు, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

అనేక చర్చిల్లో

పట్టణంలోని వాడవాడలా క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్‌లోని సిఎస్ఐ చర్చిలో, సత్యనారాయణపురంలో ఫుల్‌గాస్పెల్ చర్చి నందు అప్పికట్ల జాషువ, పెద్దకాల్వసెంటర్‌లోని గాస్పెల్ ప్రేయర్ టెంపుల్ మినిస్ట్రీస్‌లో పాస్టర్ సజ్జా బర్నబాస్, నాగవరప్పాడులోని రివైవల్ పెంతుకొస్తు మినిస్ట్రీస్, చౌదరిపేటలోని షారోను ప్రార్ధనా మందిరం మందపాడులో ఫిలదెల్ఫియ ప్రార్ధన మందిరంలో, సీయోను గాస్పెల్ ఫెలోషిప్ చర్చి, పెదఎరుకపాడులోని న్యూలైఫ్ ప్రార్ధనా మందిరము, బాపూజీనగర్‌లో సెయింట్ దేవదాసు చర్చి, కార్మికనగర్‌లో బైబుల్ మిషన్ సీయోను ప్రార్ధనమందిరం, నాగవరప్పాడులోని క్రీస్తు ప్రేమ సువార్త మందిరం, మందపాడు కొత్తకాలనీలో బేతెస్థ ప్రార్ధనా మందిరం, పంచవటీ కాలనీలో నూతన యేరూషలేము ప్రార్ధనా మందిరము, పెదఎరుకపాడు ఇమ్మానియేలు చర్చిలో, బిలీవర్స్ ఫెలోషిప్, సిఎస్ఐ చర్చిలతో పాటు పట్టణంలోని పలు చర్చిలలో క్రైస్తవ బోధకులు క్రీస్తు జన్మదిన సందేశాన్ని విశ్వాసులు అందించారు.

కూచిపూడి: లోకరక్షకుడైన ఏసుక్రీస్తు జన్మదినాన్ని ప్రపంచమంతా క్రిస్మస్ మహోత్సవంగా జరుపుకుంటున్న ఆనందకర సందర్భంగాశనివారం అర్ధరాత్రి,నుంచి ఆదివారం వేకువఝామువరకు నిర్వహించిన వేడుకలు అంబరాన్ని అంటాయి. మొవ్వ మండలంలోని పెదపూడి బేతేల్ చర్చిలో మొవ్వ మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు, ఆ చర్చి పాస్టర్ అప్పికట్ల ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. అర్ధరాత్రి 12 గంటలకు కేకు కట్ చేసి క్రీస్తు భక్తుల నడుమ యేసుజన్మదిన వేడుకలను నిర్వహించి ప్రార్ధన జరిపారు. ఈ వేడుకలలో మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు తరలిరాగా పలువురు పాస్టర్స్ ఆధ్యాత్మిక ప్రసంగాలు, గీతాలను ఆలపించారు. బార్లపూడి గ్రామంలో క్రిస్ట్ గాస్పెల్ పెయిత్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పాస్టర్ డాక్టర్ హనోక్ పర్యవేక్షణలో ఈ వేడుకలను నిర్వహించారు. మొవ్వ లైఫ్ గ్రౌండ్లో యేసే జవాబు సహవాస అధ్యక్షులు, కృష్ణాజిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధరాజు ఆధ్వర్యంలో క్రీస్తు జనన వేడుకలు అంబరాన్ని తాకాయి. వందలాది భక్తుల నడుమ వేడుకలు నిర్వహించి ప్రసంగాలు జరిపారు. కేకు కట్ చేసి దీపాలు వెలిగించిన క్యాండిల్స్ ప్రదర్శన నిర్వహించారు.

తిరువూరు: లోకరక్షకుడిగా జన్మించిన క్రీస్తు ప్రభువు మానవత్వాన్ని ప్రభోదించారని తిరువూరు ఆర్సీఎం చర్చి ఫాదర్ విజయ్ కుమార్ అన్నారు. క్రిస్మస్ పర్వదిన సందర్భంగా మండలంలోని క్రైస్తవ దేవాలయాల్లో శనివారం తెల్లవారు ఝాము నుంచే ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. వాక్యోపదేశం, దివ్యబలి పూజ, దివ్య సత్ప్రసాద స్వీకరణ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గాయక బృందం ప్రత్యేక గీతాలు ఆలపించారు, క్రిస్మస్ వేడుకల్లో భాగంగా నిర్వహించిన క్రిస్మస్ పాటలు, నాటికల పోటీలు, బైబిల్ క్విజ్, ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. పట్టణంలోని క్రాస్, తెలుగు బాప్టిస్ట్ చర్చి లు, సీఎస్ఐ టౌన్ చర్చి, క్రీస్తు సంఘం, కల్వరి, ఏల్ బెతెల్, బిలీవర్స్ చర్చి లలో కూడా ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అధిక సంఖ్యలో క్రైస్తవ విశ్వాసులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంత క్రైస్తవ దేవాలయాల్లో క్రీస్తు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

పమిడిముక్కల: మానవుని మనుగడకు ఏసుక్రీస్తు బోధనలే అనుసరణీయమని దయ క్షమా ప్రేమతత్వం అందరిలో ఉండాలని హొసన్న ప్రార్ధనా మందిరంలో పాస్టర్లు వ్యాఖ్యానించారు. ఆదివారం క్రిస్మస్ ఏసుప్రభు జన్మదిన సందర్భంగా వాడవాడలా సహవాసకులు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. గ్రామాలలో చర్చలను విద్యుత్ దీపాలతో స్టార్లతో అలంకరించారు. ఒకరికి ఒకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకొని ప్రత్యేక ప్రార్ధనలు చేసి అందరూ ప్రేమ దయతో ఉండాలని ఆకాంక్షించారు.

పెదపారుపూడి: మండలంలోని వీధి, వీధినా క్రీస్తు జన్మ దినోత్సవ వేడుకలు డిసెంబర్ 25వ తేదీన ఘనంగా నిర్వహించారు. ఆరోజు తెల్లవారుజాము నుండి ప్రత్యేక పాటలు, ప్రార్ధనల, కొవ్వొత్తులతో, క్రిస్మస్ గీతాలతో, ఆ దేవదేవుని జననం గురించి ఆయా సంఘాల క్రైస్తవ సేవకులు క్రీస్తు భక్తులకు బైబిల్ ఆధారంగా క్రీస్తు జననం గురించి వివరించారు . అనంతరం క్రిస్మస్ కేకులు కట్ చేసి మిఠాయిలు, పళ్ళు విశ్వాసులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేశ్వరపురం సి బి సి ఎం సి సంఘములో ఆ సంఘ సేవకురాలు తిరువీధి కరుణశ్రీ పీటర్ క్రీస్తు జననం గురించి మాట్లాడుతూ దేవుడు రక్త మాంసాలతో జన్మించి పుడమిని పులక పులకింప చేశారని అన్నారు. దావీదు పట్టణమందు నేడు మన కొరకు రక్షకుడు పుట్టియున్నాడని సందేశం ఇచ్చారు. ఆయనే ప్రభువైన క్రీస్తు అని విశ్వాసులకు బోధించారు. ఈ కార్యక్రమంలో గ్రామాలలో క్రైస్తవ భక్తులు విరివిగా పాల్గొన్నారు.

కోడూరు: క్రిస్మస్ పండగను క్రైస్తవ సోదరులు ఆదివారం ఘనంగా నిర్వహించారు.మండల పరిధిలోని పలు చర్చిలలో ఉదయం నుండి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.కోడూరులోని ప్రముఖ రైల్వే కాంట్రాక్టరు తిరుపతి శ్రీనివాసరావు గ్రాండ్ క్రిస్మస్ వేడకలను ఘనంగా నిర్వహించారు ప్రసిద్ధ జాతీయ, అంతర్జాతీయ వాక్యోపదేశకులు,గాయకులు పాల్గోని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు అలాగే 15 వేల మందికి ఆత్మీయ విందు ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమంలో కోడూరు మండల ప్రజలు రాజకీయ నాయకులు మండల వాక్యోపదేశకులు పాల్గోన్నారు.

గంపలగూడెం: క్రిస్టమస్ పర్వదినాన్ని మండలంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి పలు చర్చల్లో ప్రార్ధనలు నిర్వహించారు. బంధువులకు, స్నేహితులకు క్రిస్టమస్ శుభాకాంక్షలు వివిధ రకాలుగా తెలియజేసుకున్నారు. బంధువులు, స్నేహితులతో క్రిస్టమస్ పర్వదినాన్ని సంతోషంగా మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు.

పెడన: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు ఆధ్వర్యంలో పట్టణంలో ఉన్న అన్ని చర్చిలకు ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఏసుక్రీస్తు వారి శాంతి, సహనం, కరుణ, ప్రేమ, దయ వేణు గారు చేసే పనిలో తోడుగా ఉండాలని చర్చిలలో దైవజనులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడుయక్కల. శ్యామలయ్య, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర దేవాంగ సాధికార కమిటీ సభ్యుడు యర్రా. నాగరాజు, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కమ్మగంటి వెంకటేశ్వరరావు (బాబు) టిడిపి నాయకులు పరసా. జితేంద్ర, సేనాపతి అజయ్, వెలిగట్ల ప్రసాద్, మేడక. కిషోర్, జీవన్ తదితరులు పాల్గొన్నారు

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు గ్రామం లోని బీసీ కాలనీ నందు రాష్ట్రమైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవిప్ జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను. అనంతరం 200 మంది వృద్ధులకు దుప్పట్లు చీరలో పంపిణీ చేశారు. కేడీసీసీబీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, నంబూరి రవి,జడ్పిటిసి పూట్ల నాగమణి,మండల పార్టీ అధ్యక్షులు పూట్ల నాగేశ్వరరావు,గ్రామ పార్టీ అధ్యక్షులు కాకాని హరి,కాకాని స్రవంతి,సొసైటీ అధ్యక్షులు గింజుపల్లి నరసయ్య ఎంపిటిసి జంగం వీరమ్మ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ తమ్మిశెట్టి సోమయ్య,తదితర గ్రామా నాయకులు పాల్గొన్నారు.

విజయవాడ(కృష్ణలంక): కృష్ణలంక రాణిగారితోటలోని 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి శనివారం క్రిస్మస్ పర్వదినం సందర్భంగా డివిజన్ ప్రజలకు, ప్రతి చర్చ్‌కు వెళ్లి స్వీట్స్ ఇచ్చి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి క్రిస్మస్ సందేశం గొప్ప సందేశమని ఆయన పేర్కొన్నారు. కులమతాలు, వర్ణ తారతమ్యాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి జీవించాలని, రాగద్వేషాలకు తావులేకుండా ఒకరిపట్ల ఒకరు ప్రేమతో జీవించాలని ఏసు సందేశం చెబుతోందని ఆయన గుర్తు చేశారు. ఏసుక్రీస్తు చూపిన మార్గాల్లో పయనిస్తే ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో జీవిస్తారని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు తిరుపతిరెడ్డి, కాశిం, నారాయణరెడ్డి, రామకృష్ణ, సుధాకర్‌రెడ్డి, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

చల్లపల్లి: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా చల్లపల్లి మండలం పురిటిగడ్డలోని ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ డా. వేములపల్లి సురేష్ వృద్ధులకు నూతన వస్త్రాలు, రగ్గులు బహూకరించారు. పురిటిగడ్డలోని గోల్డెన్ క్యాండిల్ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో వేములపల్లి సురేష్ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చిలోని 100 మంది పరిచర్యకులకు నూతన వస్త్రాలు బహూకరించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐవీఎం ప్రతినిధులు రోజా, విజయ, స్విటిన్ రాస్ తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి: క్రిస్మస్ పర్వదిన వేడుకలు ఆదివారం చల్లపల్లి మండలంలో వాడవాడలా ఘనంగా జరిగాయి. సాలిపేట ఆర్సీఎం చర్చిని విద్యుద్దీపాలతో అలంకరించగా, ఆర్సీఎం చర్చి ఫాదర్ జోసెఫ్, నూజివీడు ఆర్సీఎం చర్చి ఫాదర్ జోజిబాబులు క్రీస్తు సందేశాన్ని తెలియచేశారు. దివ్యబలిపూజను జరిపి విశ్వాసులకు సప్రసాదంను అందచేశారు. ఈ సందర్భంగా మరియదళ సభ్యులు ఆలపించిన ప్రార్ధనా గీతాలు అలరించాయి. లక్ష్మీపురం, చల్లపల్లితోపాటు అన్ని గ్రామాల చర్చిల్లోనూ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా చర్చిల్లో పాస్టర్లు క్రీస్తు సందేశాలను విశ్వాసులకు తెలియచేశారు.

విజయవాడ: క్రిస్మస్ వేడుకల్లో భాగంగా బెంజ్‌సర్కిల్ సమీపంలోని సెయింట్ పాల్స్ కథెడ్రల్‌లో విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావు, మోన్సిగ్నోర్ పాల్స్ కథెడ్రల్ విచారణ కర్తలు ఫాదర్ మువ్వల ప్రసాద్ తదితర గురువులు ప్రత్యేకంగా 'క్రిస్మస్ సమిష్టి దివ్యపూజాబలి' సమర్పించారు. క్రైస్తవులకు పవిత్ర గ్రంథమైన 'హోలీ బైబిల్‌'ను ప్రత్యేకంగా ప్రదర్శించారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సాయంత్రం ఫాదర్ మువ్వల ప్రసాద్ ఆధ్వర్యంలో క్రిస్మస్ ప్రత్యేక ఆరాధన కార్యక్రమం జరిగింది. ఈ ప్రార్ధనలో పరిసరప్రాంతానికి చెందిన క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరైయ్యారు. ఈ సంవత్సరం ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీలు, క్రీస్తు జననం తెలిపే బాలయేసు పశువుల పాక కొట్టం ఎంతగానో ఆకట్టుకుంది. బాలయేసు ప్రతిమలను సందర్శించి ప్రార్ధనలు చేశారు. క్రైస్తవ పోదరులు పెద్ద సంఖ్యలో రావటంతో చర్చ్ ప్రాంగణం కోలాహలంగా మారింది. నగరంలోని 54వ డివిజన్ పాత రాజరాజేశ్వరి పేటలో ఆదివారం జేఎస్.మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మినిస్ట్రీస్ పాస్టర్ లితమ్మ మధుసూదన్ రెడ్డి సంఘ సభ్యుల ఆధ్వర్యంలో చర్చిలో ఘనంగా క్రిస్టమస్ వేడుక జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్థానిక కార్పోరేటర్ యలకల చలపతిరావు మాట్లాడుతూ మానవాళికి ప్రేమ, కరుణ, దయ పంచిన యేసు క్రీస్తు జన్మదినాని క్రిస్మస్‌గా జరుపుకుంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా పేదలకు నూతన వస్త్రాలను కార్పోరేటర్ ద్వారా మధుసూదన్‌రెడ్డి అందజేశారు. అనంతరం 2023 డైరీని ఆవిష్కరించారు. పాస్టర్ ఎం.డబ్ల్.జోబ్ పాల్గొని నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల,మత ,బేధాలు లేకుండా నిరుపేదకు అండగా ఉండే జె.ఎస్ మినిస్ట్రీస్ ని,వారి సేవల్ని కొనియాడారు.

విస్సన్నపేటటౌన్: విస్సన్నపేటలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం క్రైస్తవ సోదరులు ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని ఆర్సీఎం, పెంతుకోస్తు, సీఎస్ఐ తదితర సంస్థల ఆధ్వర్యంలోని ప్రార్ధనాలయాల్లో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. క్రీస్తు జన్మదినం, లోకానికి తెలిపిన వాక్యాలను ఈ సందర్భంగా మతగురువులు వివరించారు.

సమస్యలతో అన్నదాత సతమతం



విశాలాంధ్ర-పమిడిముక్కల: మండల పరిధిలోని రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం 'మాండూస్' తుపాను ధాటికి తడిసింది. కొనుగోళ్లల్లో తేమ శాతం, రంగు మారిందనే సమస్యలతో సతమతమవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పడిన వర్షాలతో పనలు తడిసి ఆరకపోవడం వలన వేసిన కుప్పలలో ధాన్యం ఆవ(ఉక్కి పోవటం), రంగు మారుతున్నాయని ఆ ధ్యానం ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. యంత్రాలతో కోసిన ధాన్యం ఆరబెట్టి అర్బీకేలకే, మిల్లర్లు దగ్గర తీసుకువెళ్ళితే తేమశాతం తేడాలు ఉంటున్నాయని ఏమిచెయ్యాలో అర్థం కాక రైతు ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోందని చోరగూడి, కపిలేశ్వరపురం, ఐనంపూడి, శ్రీరంగపురం తదితర గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆర్బీకేలో రంగు మారిన, మొలకవచ్చిన ధాన్యాన్ని తేమ ఐదు శాతం మాత్రమే ప్రభుత్వ అనుమతి ఉందనీ కాని సదరు ధాన్యం ప్రస్తుతం పదిహేను శాతం ఉందని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం నిబంధనలు సడలించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల జిల్లా వ్యవసాయాధికారి మనోహర రావు ఎ.ఓ గణేష్ రెడ్డి ముంపు ప్రాంతాలను పరిశీలించి సమస్యని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ల తామని ధైర్యం చెప్పిన విషయం విదితమే.

ముగిసిన డయాబెటీస్ ఎండో కాన్ఫరెన్స్-2022



విశాలాంధ్ర-విజయవాడ (లబ్బీపేట): షుగర్ వ్యాధిపై జరుగుతున్న పరిశోధనల వల్ల ఆశాజనకమైన ఫలితాలు వస్తున్నాయని, ముఖ్యంగా కృత్రిమ ప్రాంక్రియాస్ రూపొందించే విషయంలో ముందంజ వేశారని ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ యలమంచి ఐశ్వర్య తెలిపారు. ఆదివారం నగరంలోని ఒక హోటల్‌లో యలమంచి డయాబెటిస్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డయాబెటీస్ ఎండో కాన్ఫరెన్స్ 2022 నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ యలమంచి సదాశివరావు, ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ యలమంచి ఐశ్వర్య మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 20 ఏళ్లుగా ఈ సదస్సు నిర్వహిస్తూ షుగర్ వ్యాధికి సంబంధించిన ఉత్తమ పరిశోధనలు చేసిన వారికి గోల్డ్ మెడల్ బహుకరిస్తున్నామని తెలిపారు. షుగర్ వ్యాధిని ముందుగానే గుర్తించడం ద్వారా అరికట్టేందుకు అవకాశం ఉందన్నారు. కాగా ఈ సదస్సులో బెంగుళూరుకు చెందిన డాక్టర్ ప్రసన్నకుమార్ కు ఫౌండేషన్ తరపున గోల్డ్ మెడల్ ను అందజేశారు.

సదస్సులో డాక్టర్ కృష్ణ శేషాద్రి, డాక్టర్ ఎస్‌కె సింగ్, డాక్టర్ షణ్ముగవేలు, డాక్టర్ జైదేవ్, డాక్టర్ నారాయణరావు, డాక్టర్ గీత, డాక్టర్ మైథిలి, డాక్టర్ శ్రీమన్నారాయణ, డాక్టర్ రవి, డాక్టర్ వరుణ్, డాక్టర్ రామ్ కుమార్, డాక్టర్ పీవీ రావు, డాక్టర్ రాకేష్, రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది షుగర్ వ్యాధి నిపుణులు, ఎండోక్రైనాలజిస్టులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి టెన్నిస్ టోర్నీలో సత్తాచాటిన ఇషాన్

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: ఈ నెల 19 నుంచి 23 వరకు హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి ర్యాంకింగ్ టెన్నిస్ ర్యాంకింగ్ చాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన ఐ.ఇషాన్ అండర్-12 వ్యక్తిగత విభాగంలో అండర్-14 మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో టైటిల్‌ను గెలుచుకోగా, అండర్-14 వ్యక్తిగత విభాగంలో రన్నరప్‌గా నిలిచాడు. ఇషాన్‌ను, కోచ్ శివరామకృష్ణను ఎన్టీఆర్ జిల్లా క్రీడాప్రాధికారసంస్థ సియిఓ యు.శ్రీనివాస రావు, చీఫ్ కోచ్ ఎస్ఏ.అజీజ్ అభినందించారు.

అమ్మవారి సన్నిధిలో మంత్రి జోగి

విశాలాంధ్ర-పెడన: పెడన పట్టణంలోని పైడమ్మ తల్లి ఆలయంలో భక్తులు ఏర్పాటుచేసిన భారీ అన్న సమారాధన కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి. రమేష్ పాల్గొన్నారు. మంత్రి భక్తులకు స్వయంగా వడ్డించారు. తొలుత పైడమ్మ తల్లి ఆలయానికి కాలినడకన వెళ్లి అమ్మకి ప్రత్యేక పూజలు చేశారు.

స్ఫూర్తి నింపిన తెలుగు రచయితల మహాసభలు

విశాలాంధ్ర-విజయవాడ: నగరంలో రెండు రోజుల పాటు జరిగిన 5వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు స్ఫూర్తినింపాయి. దేశ విదేశాల నుండి 1600 మంది ప్రతినిధులు తరలివచ్చి, తెలుగు భాషా పరిరక్షణ బాధ్యత తీసుకోవలసిందిగా జనబాహుళ్యాన్ని ఏకగ్రీవంగా కోరారు. మనం మాట్లాడే వాడుక బాషే పెనుప్రమాదంలో ఉన్నదని, తెలుగు వాడకంలో ఉంటేనే భాష సజీవంగా ఉంటుందనే గ్రహింపు తెలుగు వారిలో కలిగించటానికి ఈ మహాసభలు ఎంతగానో ఉపకరించాయి. భాష పరిరక్షణలో తెలుగు పత్రికలు ఈ విషయంలో నిర్వహించిన పాత్ర గణనీయమైనదని వక్తలు అభిప్రాయపడ్డారు. మహిళా ప్రతినిధులు తమ గళాన్ని ఘనంగా వినిపించారు. మారుతున్న సామాజిక పరిస్థితుల్లో రచయితల పాత్ర అనే అంశంపై ప్రధానంగా జరిగిన సదస్సులలో వివిధ రంగాలకు చెందిన రచయితలు పెచ్చుమీరుతున్న వాణిజ్య సంస్కృతి పట్ల ప్రజల్ని అప్రమత్తం చేయాల్సిన బాధ్యత గురించి విస్తృతంగా చర్చించారు. మూడు వేదికలపైన సమాంతరంగా 30కి పైగా సదస్సులు, కవిసమ్మేళనాలు, వివిధ సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. జాతీయ ప్రఖ్యాతి పొందిన యువ అష్టావధానులతో అద్భుతావధానం, 15 మంది కవులతో గజల్స్ ముషాయిరా, కళారత్న కె.వి. సత్యనారాయణ బృందం నిర్వహించిన ఆముక్తమాల్యద నృత్య రూపకం, నేక్షిత అనే చిన్నారి చేసిన నృత్యప్రదర్శన ఈ మహాసభల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విదేశీ ప్రతినిధుల కోసం, రాష్ట్రేతరాంధ్ర ప్రతినిధులకోసం వేర్వేరు సదస్సులు జరిగాయి. సభలను ప్రారంభించి, భాషోద్యమాన్ని ప్రజల్లోకి తీసుకుపోవలసిన అవసరాన్ని భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు నొక్కి చెప్పగా, భారత సుప్రీం కోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యన్. వి. రమణ తెలుగు భాషను ఆధునీకరించి, సాంకేతిక ప్రగతితో అనుసంధానం చేయటం ద్వారా తెలుగును 'ప్రపంచతెలుగు'గా తీర్చిదిద్దాలన్నారు. యువతను అభ్యుదయ మార్గాన నడిచేలా మార్గదర్శనం చేయాల్సిన అవసరాన్ని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వి.వి. లక్ష్మీనారాయణ నొక్కి చెప్పగా ప్రభుత్వాధినేతలకన్నా రచయితలే ఎక్కువ ప్రభావశీలురని, సమాజాన్ని మేల్కొల్పగలిగేది వారేనని గరికపాటి నరసింహారావు అన్నారు. ఎన్ని ఇతర భాషలను ప్రోత్సహించినా మాతృభాషకు ప్రాధాన్యత తగ్గకూడదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషశాయి అన్నారు. యువ రచయితలు, ఉపాధ్యాయులు ఈ సభల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ మహాసభల నిర్వహణకు సహకరించిన అందరికీ కృష్ణాజిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్, అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి జి.వి.పూర్ణచంద్ ఆదివారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. భవిష్య కార్యాచరణతో మరిన్ని కార్యక్రమాల నిర్వహణకు ఈ మహాసభలు స్ఫూర్తిదాయకం కాగలవని ఆకాంక్షించారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

ఘనంగా కాకాని వెంకటరత్నం వర్ధంతి

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు: మాజీ మంత్రి కాకాని వెంకట రత్నం 50వ వర్ధంతిని పెనుగంచిప్రోలు పాత సినిమా హాల్ సెంటర్లోని కాకాని విగ్రహవద్ద టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకులు వేగినేటి గోపాల కృష్ణ మూర్తి, చింతల సీతారామయ్య, సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి, జెడ్పీటీసీ ఊట్ల నాగమణి, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, ఆలయ మాజీ చైర్మన్ వాసిరెడ్డి బెనర్జీ పాల్గొని ప్రసంగించారు. టీడీపీ నాయకులు, మాజీ జెడ్పీటీసీ గజ్జి కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుధీర్ బాబు, మాదినేని వెంకట్రావు. కొలిపాక. బ్రహ్మం, నాగేశ్వరరావు, కాకాని బ్రహ్మం, కాకాని వెంకటేశ్వరరావు, కాకాని రవి, వైసీపీ నాయకులు వేల్పుల రవికుమార్. ఊట్ల నాగేశ్వర రావు, కాకాని హరి, నల్లపునేని వెంకటనారాయణ. గింజుపల్లి నరసింహారావు, కాకాని శ్రీనివాసరావు, కోటేశ్వర రావు, తిరుపతమ్మ ఆలయ పాలక వర్గం సభ్యుడు నరసింహారావు పాల్గొన్నారు.

ముతవల్లీ, సంయుక్త ముతవల్లీ పదవీకాలం పూర్తి

విశాలాంధ్ర-విజయవాడ(లబ్బీపేట): గొల్లపూడి గ్రామం, నల్లకుంటలోని హజరత్ మజిలి బాబా దర్గా ముతవల్లి, సంయుక్త ముతవల్లిల పదవీ కాలం ముగిసినట్టు రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం దర్గాకు ముతవల్లిగా షేక్ ఖాజా, సంయుక్త ముతవల్లిగా షేక్ ముస్తఫా కొనసాగుతున్నారు. వాస్తవంగా వారి పదవీకాలం ఈనెల 8తోనే ముగిసినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

స్కేటింగ్‌లో నగర క్రీడాకారులకు పతకాలు

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: ఈనెల 11 నుండి 22 వరకు బెంగళూరులో జరిగిన 60 వ జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ లో బెజవాడ రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ క్రీడాకారులు పతకాలు సాధించినట్లు బెజవాడ రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బచ్చుమాధవి కృష్ణ తెలిపారు. బచ్చు వరుణ్ కృష్ణ ఇన్ లైన్ డౌన్ హిల్ సీనియర్ విభాగంలో గోల్డ్ మెడల్, స్పీడ్ ఇన్ లైన్ విభాగంలో ఎన్. నిహారిక గోల్డ్ మెడల్, జూనియర్ విభాగంలో రోలర్ ఫ్రీ స్టైల్ లో అభిరామ్ బ్రాంజ్‌మెడల్ సాధించినట్లు బచ్చు మాధవి కృష్ణ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరముల నుండి జాతీయస్థాయిలో ప్రతి సంవత్సరము అధిక మెడల్స్ సాధిస్తున్న ఘనత బెజవాడ రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ క్రీడాకారులదేనని ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

పేకాట శిబిరం దాడి

విశాలాంధ్ర-ఘంటసాల: పేకాట, జూద శిబిరాలపై పోలీసులు వరుస దాడులు జరుపుతున్నారు. మండలంలోని ఘంటసాలపాలెం శివార్లలో జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను ఆదివారం ఎస్ఐ శ్రీనివాసు అదుపులోకి తీసుకున్నారు. పేకాట ఆడుతున్న వారి నుంచి రూ. 2280 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఘంటసాల పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట, జూదాలు ఆడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

మద్యం మత్తులో హత్య?

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): అనుమానాస్పద మృతి కేసు మిస్టరీ వీడింది. దాన్ని పోలీసులు హత్యగా నిర్ధారించారు. ఈనెల 20న జక్కంపూడి కాలనీ 40-60 ఫ్లాట్స్ వద్ద అనుమానాస్పద స్థితిలో పోలీసులు మృతదేహం గుర్తించారు. చిట్టినగర్‌కు చెందిన మెండి శివ, అతని స్నేహితులు కలిసి జక్కంపూడి సమీపంలో మద్యం సేవించారు. మెండి శివ తన స్నేహితులను అసభ్యంగా బూతులు తిట్టడంతో ఆగ్రహించిన స్నేహితులు అతడిపై దాడి చేసి అక్కడే వదిలి వెళ్లిపోయారు. అయితే శివ చనిపోయిన విషయం వారు గుర్తించలేదు. స్థానికులు గుర్తుతెలియని మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందించారు. అయితే శివ కనిపించడం లేదని 24న బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. లోతుగా దర్యాప్తు చేసిన పోలీసులు, శివ హత్యకు గురయ్యాడని నిర్ధారించారు. ఇద్దరిని అదుపులో తీసుకుని విచారిస్తున్నారు.

మధుమేహం ఆవశ్యకతపై నదీ నిడివి ఈత

విశాలాంధ్ర-విజయవాడ: మధుమేహం ఉన్న చిన్నారులకు వ్యాయామం ఆవశ్యకతపై చైతన్యం కలిగించేందుకు అవార ఈత శిక్షణ - ప్రాణరక్షణ అకాడమీలో శిక్షణ పొందిన చిన్నారులతో ఆదివారం 1.5 కిలోమీటర్ల నదీ నిడివి ఈత నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని ప్రముఖ డయాబెటాలజిస్ట్, నిమ్స్ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ విష్ణుప్రియారావు ఆకులతో తయారుచేసిన జెండాను ఊపి ప్రారంభించారు. మారుతున్న కాలనుగుణంగా చిన్నారుల్లో మధుమేహం ఎలా వ్యాప్తిచెందుతోందో ఆయన వివరించారు. అలాగే బాలికల్లో దేహదారుఢ్యం, మనోవికాసాలను పెంచుతున్న అవారాను అభినందించారు. ప్రముఖ పర్యావరణవేత్త, అవార వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ అజయ్ కాట్రగడ్డ మాట్లాడుతూ చిన్నారులకు మందులు, ఇన్సులిన్‌తో పాటు, వ్యాయామ దినచర్య మేలని తెలిపారు. వారిలో ఈ క్రమశిక్షణ పెంపొందించేలా అవార ఆదివారాల 'ప్రకృతిలో పిల్లలు' కార్యక్రమం ప్రధాన లక్షణమని తెలిపారు. ఈ సందర్భంగా 1.5 కిలోమీటర్ల ఈత పూర్తి చేసిన రాధిక, రాజ్‌కమల్, శంకుత్, లక్ష్మీశ్రీ, వైష్ణవి, డా॥ శ్రీహర్ష, శ్రీలక్ష్మిలను అభినందించారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



విశాలాంధ్ర-తిరువూరు: పని ఒత్తిడి, హడావిడి జీవితంలో ఆధ్యాత్మిక చింతన మానసిక ప్రశాంతతను అందిస్తుందని తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగ నర్సిరెడ్డి అన్నారు. మండలంలోని మునుకుళ్ల ఎస్సీ కాలనీలో నూతనంగా చేపట్టిన చర్చి నిర్మాణానికి ఆయన రూ.50 వేల నగదును వితరణగా ఇచ్చారు. పేద మధ్య తరగతి వర్గాల ప్రజల ప్రయోజనాల కోసం అనేక విధాల ఆర్థిక సాయం అందిస్తున్న నాగ నర్సిరెడ్డి రెడ్డిని మునుకుళ్ల, వావిలాల పీఏసీఎస్ చైర్ పర్సన్ లు వెదురు గోపిరెడ్డి, కొమ్మినేని కిషోర్, మునుకుళ్ళ ఎంపీటీసీ నర్సింగ్ వెంకటకృష్ణ అభినందించారు. వైసీపీ నాయకులు సిరికొండ కృష్ణ, పుల్లయ్య, పెద్దవరం గ్రామ వైసిపి నాయకులు నరసింహారావు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-కంచికచర్ల: కంచికచర్ల శ్రీ వెంకటేశ్వర క్లాత్ ఎంపోరియం 56వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. నందిగామ ఐకాన్ కేర్ హాస్పిటల్ వైద్య సిబ్బంది శిబిరంలో పాల్గొని కంటి రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. కంచికచర్ల పరిసర ప్రాంతాల నుండి, వివిధ రకాల కంటి సమస్యలతో బాధపడుతున్న 150 మంది కంటి వ్యాధిగ్రస్తులను అధునాతన మిషనరీలతో పరీక్షించారు. అవసరమైన వారికి వెంకటేశ్వర క్లాత్ ఎంపోరియం అధినేత మండల సుధాకర్ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి నందిగామ ఐకాన్ కేర్ హాస్పిటల్ లో ఉచితంగా కంటి శాస్త్ర చికిత్సలు సైతం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత దశాబ్దాల కాలంగా శ్రీ వెంకటేశ్వర క్లాత్ ఎంపోరి ఆధ్వర్యంలో కంచికచర్లలో కంటి వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు.

జాతీయస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఏపీ జట్లు

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: రాజస్థాన్‌లోని సవై మాన్ సింగ్ స్టేడియంలో జరుగుతున్న 41వ సీనియర్ నేషనల్ షూటింగ్ బాల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్లను ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు అశోక్ కుమార్, భాగ్య రాజు, సీనియర్ క్రీడాకారుడు కూర్షీద్ భాష తదితరులు పాల్గొన్నారు. **బాలుర జట్టు:** శివకృష్ణ,(కెప్టెన్) నవీన్, అభిలాష్, మంజునాథ్, శ్యామ్, నరేష్ కుమార్, రాము, మురళి, రత్న శేఖర్, షేక్ కమర్ భాష, చక్రవర్తి చేతన్ ఆనంద్. కోచ్: భాగ్యరాజు. **బాలికల జట్టు:** నవ్య (కెప్టెన్), శాంతి, తులసి రాణి, ప్రేమ మాధురి , ప్రవల్లిక, ధనలక్ష్మి , పుష్పావతి , తేజశ్రీ , జోత్స్న , సారూప్య ,లావణ్య, లక్ష్మీ భవాని. కోచ్ : పి శ్రావణి

చల్లపల్లితో సినీనటుడు చలపతిరావు అనుబంధం

విశాలాంధ్ర-చల్లపల్లి: ప్రముఖ సినీనటుడు తమ్మారెడ్డి చలపతిరావుకు చల్లపల్లి గ్రామంతో అనుబంధం ఉంది. చలపతిరావు పెద్దకుమార్తె జయశ్రీదేవి చల్లపల్లి కోడలే. చల్లపల్లి మునుసబ్ బజారుకు చెందిన శ్రీనివాస ట్యుటోరియల్స్ నిర్వాహకులు చాపలమడుగు సుభాస్ చంద్రబోస్ పెద్దకుమారుడు ఉదయ్ కుమార్(ఎన్నారై)కు చలపతిరావు కుమార్తెను ఇచ్చి వివాహం చేశారు. కుమార్తె చల్లపల్లి కోడలు కావటంతో అప్పుడప్పుడూ చల్లపల్లి వచ్చి వెళుతుండేవారు. చివరిసారిగా చలపతిరావు చల్లపల్లికి 2016లో వచ్చారు. అల్లుడి సోదరుడు రవికుమార్ మృతిచెందటంతో చల్లపల్లి వచ్చారు. ఈ సందర్భంగా చలపతిరావు వియ్యపురాలు కళావతి మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అందరితో చలపతిరావు ఎంతో ఆప్యాయంగా ఉండేవారన్నారు. చాలా మంచి వ్యక్తని, ఆయన మరణం బాధకరమన్నారు.

సీఎం రోడ్డుకు ఎన్టీఆర్ రోడ్డుగా నామకరణం

విశాలాంధ్ర-నందిగామ: నందిగామలో చారిత్రాత్మకమైన ఘట్టం నేడు నెలకొందని ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్రావు అన్నారు. స్థానిక సీఎం రోడ్డు పునర్ నిర్మాణ కార్యక్రమం ఆదివారం నిర్వహించి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి ఆ రోడ్డుకు ఎన్టీఆర్ పేరును నామకరణం చేయడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన అన్నారు ఆదివారం స్థానిక సీఎం రోడ్డు లక్ష్మీప్రసన్న సెంటర్ వద్ద ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ అరుణకుమార్ తో కలిసి ఆయన పాల్గొన్నారు నగర పంచాయతీ 14,15వ ఆర్థిక సంఘం నిధులతో సుమారు 1 కోటి 37 లక్షలతో రోడ్డు నిర్మాణ కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా సియమ్ రోడ్ లో ట్రాఫిక్ ఇబ్బందులు పడుతున్న పట్టణ ప్రజలకు నేటితో ఆ ఇబ్బందులు తొలగిపోయాయని అన్నారు ఎన్నో ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయి కానీ ఏ అధికార పార్టీ కూడా ప్రజల ట్రాఫిక్ కష్టాలను పోగొట్టిన సందర్భం లేదనీ, వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత తమ ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా సీఎం రోడ్డులో అక్రమ,ప్రైవేట్ కట్టడాలను తొలగించి 40 అడుగుల రోడ్డు విస్తీర్ణం చేయగలిగామని అన్నారు గత సంవత్సర క్రిస్టమస్ పండుగ రోజు రోడ్ నిర్మాణ పనులు ప్రారంభించి నేటి క్రిస్మస్ రోజు తో బీటీ రోడ్ ప్రారంభం చేయటం జరిగిందని తెలిపారు పునర్నిర్మాణమైన రోడ్డుకు ఎన్టీఆర్ రోడ్డుగా నామకరణం చేసి బిటి రోడ్డును వారు స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ మండవ వరలక్ష్మి స్థానిక నాయకులు కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ప్రారంభించారు హైవే నుండి ఎన్టీఆర్ రోడ్డు ఎంట్రన్స్ లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

ఘనంగా మనువాద పతన దినోత్సవం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: మనువాదం పతనమైన దినంగా పేర్కొంటూ విస్సన్నపేటలో ఆదివారం మనువాద పతన దినోత్సవాన్ని దళితసంఘాల నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మనువాదం భారతదేశంలో పెనువిధ్వంసం సృష్టించిందంటూ ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ, అంబేడ్కర్ కృషిని కొనియాడారు. కార్యక్రమంలో దళితసంఘాల నాయకులు ఎం.జ్ఞానరత్నం, కోపల్లి జయకర్‌బాబు, బ్రహ్మ, ఎం.కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగభారతి డివిజన్ కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: తిరువూరు డివిజన్ వినియోగభారతి నూతన కార్యవర్గాన్ని సంఘం ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ కోదండరామయ్య ఆదివారం ప్రకటించారు. డివిజన్ గౌరవాధ్యక్షునిగా పి.ఎస్.మోహనరావు (విస్సన్నపేట), అధ్యక్షునిగా మద్దిరెడ్డి శ్రీనివాసరెడ్డి (పుట్రేల), ప్రధాన కార్యదర్శిగా దురిశేటి హేమసుందర్(తిరువూరు) ఎన్నికయ్యారు. సంఘం ఉపాధ్యక్షులుగా గంధం వెంకటేశ్వరరావు(చంటి) (కంభంపాడు), వై.సుబ్బారావు(తిరువూరు), పి.మల్లయ్య (తిరువూరు), పలగాని శరత్‌బాబు(విస్సన్నపేట)లు ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా జీఆర్‌కె.రెడ్డి(తిరువూరు), టి.జగన్మోహనరెడ్డి(విస్సన్నపేట), సువర్ణస రామాచారి(తిరువూరు), అంగిడి ప్రసాదరావు(విస్సన్నపేట), రేగళ్ల వెంకట సత్యనారాయణరెడ్డి(రేపూడి), జి.లక్ష్మారెడ్డి(కొత్తపల్లి), కోశాధికారిగా ఎన్.రఘు శ్రీనివాస్(తిరువూరు)లను ఎన్నుకున్నారు.

గుడివాడ ఉద్రిక్తం

విశాలాంధ్ర-గుడివాడ: టీడీపీ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు చంపేస్తామంటు గడ్డం గ్యాంగ్ నేత మెరుగుమాల కాళీ బెదిరింపులు. ఆదివారం రాత్రి మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు వ్యక్తి గత ఫోన్ నెంబర్‌కు కాల్ చేసి అసభ్య పదజాలంతో గడ్డం గ్యాంగ్ నేత మెరుగుమాల ఖాళీ ఫోను చేసి బేదిరించినట్లు టిడిపి నాయకులు కొడాలి రామరాజు, వాసే మురళీ, నిమ్మగడ్డ సాయి, పండ్రాజు సాంబయ్యలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతుండగా పెట్రోల్ సంచులతో టిడిపి నేతలపై దాడికి గడ్డం గ్యాంగ్ సభ్యులు, ఇరువర్గల మధ్య వాగివాదం చోటుచేసుకుంది. సంఘటన స్థలానికి చెరుకున్న మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావు తన కార్యకర్తలతో వస్తుండగా 1టౌన్ సిఐ గోవిందరాజు తన సిబ్బందితో గండం గ్యాంగ్‌ను నిలవరిస్తు, టిడిపి నాయకులపై లాఠీ చార్జి చేశారు. ఈ సందర్భంలో కొంత మంది విలేకర్లుపై గడ్డం గ్యాంగ్ దాడికుడా చేయడం గమనర్హం. ఈ సందర్భంగా గడ్డం గ్యాంగ్ నాయకులు రేపు వంగవీటి మోహనరంగ వర్ధంతి కార్యక్రమాలు ఎలా చేస్తారో చూస్తామని బెదిరింపులు చేయడం జరిగింది. విషయం తెలుసుకొని అగ్రహొదృక్తులైన టిడిపి శ్రేణులు. రంగా వర్ధంతిని టిడిపి అధ్వర్యంలో చేస్తామని సవాల్ విసిరినా టిడిపి నాయకులు.

సామినేని ఆర్థికసాయం

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు మండలంలోని గుమ్మడిదురు గ్రామ వైస్సార్సీపీ సోషల్ మీడియా కన్వీనర్ బంకా రవి కుమార్తె అనారోగ్య సమస్యతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొని వైద్య ఖర్చుల నిమిత్తం జగ్గయ్యపేట నియోజకవర్గ వైస్సార్సీపీ సోషల్ మీడియా తరపున 12500/- రూ పాయలు నగదును ఆదివారం రాష్ట్ర ప్రభుత్వవిప్,జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ్యుల సామినేని ఉదయభాను చేతులమీదుగా వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఉదయభాను వారితో మాట్లాడుతూ ఇకను వైద్య ఖర్చులు ఏమైనా అవసరం ఉంటే నా దృష్టికి తీసుకురావాలని వారికి ఆర్థికంగా అండగా ఉంటానని భరోసాను కల్పించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ నరెడ్ల కిషోర్,నియోజకవర్గ కోకన్వీనర్లు షేక్ ఖదీర్,లేళ్ల నాగేంద్ర రెడ్డి, పెనుగంచిప్రోలు మండల సోషల్ మీడియా కన్వీనర్ నల్లబోతుల వెంకటేష్,మండల కోకన్వీనర్ యర్రంశెట్టి నాగబాబు,మండల కోకన్వీనర్ పూలమాల అనిల్.ఏటిపట్టు గ్రామాల మండల కన్వీనర్ ఈదర వెంకట్రావు,వత్సవాయి మండల కన్వీనర్ నరేష్, బెల్లంకొండ సురేష్ ,మాగళ్లు సోషల్ మీడియా కోఆర్డినేటర్ యస్వంత్,తదితర సోషల్ మీడియా వారియర్స్ పాల్గొన్నారు.

పదో రోజుకు రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-వీరులపాడు: మండల కేంద్రాన్ని వీరులపాడు నుండి తరలిస్తున్న నేపథ్యంలో, తరలింపునకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా మండల కార్యాలయాల ఎదుట ఆదివారం నిర్వహించిన రిలే నిరాహార దీక్ష పదవ రోజుకు చేరుకుంది. ఈ రిలే నిరాహార దీక్షలో వీరులపాడు గ్రామానికి చెందిన బాణావత్ బరియా,బాణావత్ రామారావు,బాణావత్ మేగ్యా నాయక్, పాలపర్తి శ్రీనివాసరావు, పాలపర్తి సుధాకర్, గురిజాల అంజయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రం తరలింపు నిర్ణయం ప్రభుత్వం వెనక్కి తీసుకునే వరకు తమ నిరసనను రోజు రోజుకి ఉధృతం చేస్తామని, రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తూనే ఉంటామని అన్నారు. వివిధ గ్రామాలకు చెందిన పలువురు రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపారు.

కబడ్డీ విజేతలకు బహుమతి ప్రదానం

విశాలాంధ్ర-వీరులపాడు: జూనియర్ (బాలల) కబడ్డీ పోటీలు వీరులపాడు మండలం జయంతి గ్రామంలో దొడ్డ వాసు యూత్ ఆధ్వర్యంలో 23,24,26 తేదీలలో నిర్వహించగా గెలుపొందిన టీములకు ఆదివారం బహుమతి ప్రధానం చేశారు. ఈ పోటీలలో మొదటి బహుమతి వీరులపాడుకు చెందిన టీం అందుకొనగా, రెండవ బహుమతి జయంతికి చెందిన టీం గెలుపొందాయి.

చలపతిరావు మృతికి ప్రజానాట్య మండలి సంతాపం

విశాలాంధ్ర-విజయవాడ: తెలుగు చలనచిత్ర రంగంలో ప్రముఖ నటుడిగా వెలుగొందిన చలపతిరావు మృతికి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి విజయవాడ నగర శాఖ ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించింది. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో చలపతిరావు 1966 సంవత్సరంలో గూడచారి నంబర్ 116 చిత్రంలో ద్వారా తెలుగు చలనచిత్ర లో ప్రవేశించటం జరిగిందని తెలిపారు. ఆనాటి నుండి దాదాపు నేటి వరకు అనేక చిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, కమెడియన్‌గా, విలన్‌గా నటించి తన నటన ద్వారా ప్రజానీకానికి మెప్పించిన నటుడని కొనియాడారు. కళా రంగం ఒక మంచి నటుడిని కోల్పోవడం చాలా బాధాకరం అన్నారు. చలపతిరావు మృతికి ప్రజానాట్యమండలి విజయవాడ నగర శాఖ నివాళులర్పిస్తూ తమ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసింది. సంతాపం తెలిపిన వారిలో ప్రజానాట్యమండలి నగర అధ్యక్షులుఎస్కే నజీర్, గౌరవ అధ్యక్షులు కేవీ భాస్కరరావు, నగర ప్రజానాట్యమండలి ఇన్చార్జి లంక దుర్గారావు, కార్యదర్శి డి. సూరిబాబు, నాయకులు కాళ్ళ చిన్నప్ప,ఎస్ కే భాష తదితరులు ఉన్నారు.

ఘనంగా వాజ్‌పాయ్ జయంతి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో బీజేపీ నాయకుడు అటల్ బీహారీ వాజ్‌పాయ్ జయంతిని ఆదివారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక లక్ష్మీటాకీస్ కూడలిలోని సీనియర్ నేత డా.జి.వీరభద్రరావు గృహం వద్ద వాజ్‌పాయి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షురాలు తోకల సుమ, నాయకులు పులపాక బాబు, పెనుగొండ రామచంద్రరావు, లాము కొండలరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ ఉత్సాహంతో కమ్యూనిస్టు నాయకులు

విశాలాంధ్ర-విజయవాడ: భారత కమ్యూనిస్టు పార్టీ 98వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు విజయవాడ నగరంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉద్యమ ఉత్సాహంతో ఉరకలెత్తుతున్నారు. ఇటీవలే పార్టీ 24వ జాతీయ మహాసభలు విజయవంత మయ్యాయి. నగరంలో ఉద్యమ ఫలితాలు రావడంతో పార్టీ నాయకులు రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తున్నారు. రెండు దశాబ్దాలుగా సింగ్‌నగర్‌లోని చెత్త డంపింగ్ యార్డును తరలించాలని పలురూపాల్లో కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు చేసింది. ఎట్టకేలకు ప్రభుత్వం దిగివచ్చి డంపింగ్ యార్డును అక్కడ నుంచి తరలించింది. 20 ఎకరాల సువిశాలమైన ఈ ప్రాంతంలో నగరానికి ఐకానిక్‌గా ఉండే విధంగా పార్కు, మార్కెట్లు ఏర్పాటు చేయటానికి సన్నాహాలు జరుగుతున్నాయి. అంతే కాకుండా కొందరు అనివీతిపరులు సింగ్‌నగర్ ప్రాంతంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించటానికి ప్రయత్నించారు. దీంతో ఆయా ప్రాంతాలను కమ్యూనిస్టు నేతలు పరిశీలించి విలువైన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా అడ్డుకున్నారు. విజయవాడ రూరల్ మండలంలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నేతృత్వంలో బృందం పరిశీలించారు. పేదలకు టిడ్కో ఇళ్లను త్వరిత గతిన పూర్తి చేసి ఇవ్వాలని ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. అలాగే జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణానికి కనీసం రూ.5లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. మాండమాస్ తుపాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని ధర్నాలు చేసి కలెక్టర్‌కు మెమోరాండం అందజేశారు. సోమవారం జరిగే వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ నాయకులు ప్రధాన కూడళ్లలో పార్టీ జెండాలు, తోరణాలతో అలంకరించారు. ప్రతి డివిజన్‌లో పార్టీ కార్యాలయం వద్ద, ప్రజాసంఘాల కార్యాలయాల వద్ద జెండా దిమ్మెలను రంగులతో తీర్చిదిద్దారు. సోమవారం సాయంత్రం వన్‌టౌన్ నిర్వహించే ప్రదర్శన, బహిరంగ సభకు రావాలని ప్రజలను ఆహ్వానిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణతో పాటు రాష్ట్ర నాయకులు హాజరుకానున్నారు.